# అర్ధరాత్రి హత్య

- ఇద్దరి మధ్య ఘర్షణ..
- రాడుతో తలపై బలంగా కొట్టడంతో మృతి
- పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన రాజ్‌కుమార్

చింతలమానేపల్లి, మే 25 : కోర్సిని గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి హత్య కలకలం సృష్టించింది. సీఐ సాదిక్ పాషా వివరాల ప్రకారం.. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలోని కోర్సిని గ్రామానికి చెందిన బొట్టుపల్లి సదయ్య అదే గ్రామానికి చెందిన మహిళతో ఎనిమిందేండ్ల క్రితం పరిచయం ఏర్పడింది. ఇద్దరు ఐదేండ్లు సహజీవనం చేసి, మనస్పర్థలు రావడంతో మూడేండ్ల నుంచి విడిగా ఉంటున్నారు. ఈ క్రమంలో ఆ మహిళకు కుటుంబ సభ్యులు వేరే వివాహం చేశారు. శుక్రవారం మహిళ అత్తగారింటి నుంచి అమ్మగారిల్లయిన కోర్సిని గ్రామానికి వచ్చింది. విషయం తెలుసుకున్న సదయ్య అర్ధరాత్రి ఆ మహిళ ఇంటికి వెళ్లాడు. ఆ మహిళ తమ్ముడు రాజ్‌కుమార్ మళ్లీ మా ఇంటికి ఎందుకు వచ్చావ్ అని అనడంతో మాటా మాట పెరిగి ఇద్దరు గొడవ పడ్డారు. స్థానికులు అడ్డుకునా వినకపోవడంతో తమ్ముడు రాజ్‌కుమార్ పక్కనే ఉన్న నల్లపైపు రాడ్, బండరాయితో తలపై, చెవిపై బలంగా కొట్టగా తీవ్రంగా గాయపడి సదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం రాజ్‌కుమార్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సదయ్య తల్లి మల్లక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

# ఏఐటీయూసీ నిరసన..



కాసిపేట : అధికారులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కాసిపేట, మే 25 : మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇన్‌క్లైన్ గనిపై కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మేనేజర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. గ్రూప్ ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీ నారాయణకు కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఇందుకు పరిష్కారానికి అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు ఇప్పకాయ లింగయ్య, పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేశ్, చంద్రయ్య, నీలయ్య, సుర మల్ల వినయ్ కుమార్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కులను కాపాడండి

రామకృష్ణాపూర్, మే 25 : ఆర్కేపీ సీహెచ్‌పీలో కార్మికుల హక్కులను కాపాడాలని హెచ్ఎంఎస్ యూనియన్ నాయకులు సీహెచ్‌పీ ఇన్‌చార్జ్ ఇంజినీర్ అశోక్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందమర్రి ఏరియా హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జే శ్రీనివాస్ మాట్లాడుతూ రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ కార్మికుల న్యాయమైన మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. సింగరేణి వ్యాప్తంగా సీహెచ్‌పీల యందు రేకు లోడింగ్ జరుగుతున్నప్పుడు రన్నింగ్ చార్జీగా గంట ఓవర్ టైం ఇవ్వాలన్నారు. బొగ్గు రవాణాలో డ్రైవర్లకు 50శాతం ప్లేడేలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, సీహెచ్‌పీ పిట్ కార్యదర్శి రామస్వామి ఉన్నారు.

# సకాలంలో ఏకరూప దుస్తులు అందించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ**



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

ఆసిఫాబాద్ టౌన్, మే 25 : వచ్చే విద్యా సంవత్సరం జూన్ 12వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అవుతాయని, జూన్ 5వ తేదీలోగా ఏకరూప దుస్తులను తయారు చేసి అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, అదనపు ప్రాజెక్టు సంచాలకులు రామకృష్ణలతో కలిసి సెర్ప్ అధికారులు, సహాయ ప్రాజెక్టు మేనేజర్లు, ఐకేపీ కమ్యూనిటీ సమన్వయకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 78 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా వారికి అవకాశం కల్పిస్తూ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తద్వారా మహిళలకు ఉపాధి కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పత్తి విత్తనాల పట్టివేత

నెన్నెల, మే 25 : మండలంలోని బొప్పారం ఆటోస్టాండ్ వద్ద 20 కిలోల అనుమతి లేని పత్తి విత్తనాలను పట్టుకున్నట్లు ఏవో ప్రేమ్ కుమార్ తెలిపారు. నారా పురుషోత్తం వద్ద అనుమతి లేని పత్తి విత్తనాలు ఉన్నట్లు సమాచారం అందగా తనిఖీలు నిర్వహించామని, 20 కిలోల లూజు పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. పురుషోత్తంను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ అనంత రావ్, హోంగార్డు రామరాజు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ నేరం

ఆసిఫాబాద్ టౌన్, మే 25 : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ అన్నారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి శ్రీ తుకారం భట్ ఆదేశానుసారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్ నాయక్ ఆసిఫాబాద్ పట్టణంలోని ఓ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సిద్ధార్థ, డిప్యూటీ డెమో నాగలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ మణికాంత్ పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన


ఆసిఫాబాద్ టౌన్, మే 25 : మండలంలోని గోవిందపూర్‌లో శనివారం విత్తనాల కొనుగోలుపై రైతులకు ఏఈవో రాము అవగాహన కల్పించారు. రైతులు లూజుగా ఉన్న సంచులలో ఉన్నటువంటి విత్తనాలు కొనుగోలు చేయవద్దు అన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్మితే వ్యవసాయ శాఖకు కానీ, పోలీస్ శాఖకు కానీ సమాచారం అందించాలని కోరారు.

## డిగ్రీ పరీక్ష కేంద్రం తనిఖీ

రెబ్బెన, మే 25: రెబ్బెన ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కాకతీయ యూనివర్సిటీ అడిషనల్ కంట్రోలర్ తిరుమల దేవి శనివారం తనిఖీ చేశారు. ఈ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ల పరీక్షలు 20 రోజులుగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ పరీక్షలు జరుగుతున్న తీరును ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. అడిషనల్ కంట్రోలర్ తిరుమల దేవితో పాటు కళాశాల ప్రిన్సిపాల్ జాకీర్ ఉస్మానియా ఉన్నారు.

# కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**సీఎండీకి వినతి పత్రం అందించిన ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం**



సీఎండీకి వినతి పత్రం అందిస్తున్న ఐఎఫ్‌టీయూ అధ్యక్షుడు బ్రహ్మానందం

శ్రీరాంపూర్/సీసీసీ నస్పూర్, మే 25 : సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు సింగరేణి సీఎండీ బలరాంకు శనివారం వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీ యూ) రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు యాజమాన్యం కోల్ సెక్టార్ సిస్టం వేతనాలు, లేదా ఫ్యాక్టరీ యాక్ట్ సిస్టం వేతనాలు అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదని సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. కార్మికులకు ఒక పర్మినెంట్ వేతన విధానం అమలు చేయాలన్నారు. పే లీవులు, పండగ మస్టర్, ఓటీ చేస్తే అదనపు డబ్బులు ఇవ్వాలని కోరారు. కార్మికులకు ఉచిత వైద్యం అందించి, 50 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఎండీ హామీ ఇచ్చారని చెప్పారు.

# కరెంటు కష్టాలపై దృష్టి పెట్టాలి

తాండూర్, మే 25 : మాదారం టౌన్‌షిప్‌లో కరెంటు కష్టాలపై సింగరేణి యాజమాన్యం దృష్టి సారించాలని ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాదారం టౌన్‌షిప్‌లోని సింగరేణి క్వార్టర్లలో ఉంటున్నటువంటి ఉద్యోగులు, కార్మికులు, కార్మిక కుటుంబాలకు సింగరేణి అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రతినిత్యం కరెంటు కోతలతో ఇబ్బందులు పడుతూ సతమతమవుతున్నారని పేర్కొన్నారు. పై అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ స్పందించడం లేదన్నారు. అధికారులు స్పందించి నిరంతరం ఫవర్ ఉండే విధంగా చూడాలని డిమాండ్ చేశారు.

## కార్మికులపై కక్షసాధింపు చర్యలు మానుకోవాలి



సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న నాయకులు

సీసీసీ నస్పూర్, మే 25 : శ్రీరాంపూర్ ఏరియాలోని సీహెచ్‌పీ డీజీఎం కార్మికులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నాయకులు బహిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య మాట్లాడుతూ రక్షణ చర్యలపై అడిగిన కార్మికులకు డీజీఎం వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. గతంలో శ్రీరాంపూర్ జీఎం సీహెచ్‌పీకి వచ్చిన సందర్భంగా ఇక్కడి సమస్యలను మహిళా కార్మికులు ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని, దీన్ని మనసులో పెట్టుకున్న డీజీఎం మహిళా కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి డీజీఎంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఫిట్ కార్యదర్శి చల్ల తిరుపతి, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు గృహ రుణాల వడ్డీ చెల్లించాలి



శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌లో కార్మికులతో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు

శ్రీరాంపూర్, మే 25 : సింగరేణి కార్మికులకు వెంటనే రూ.10 లక్షల గృహ రుణాల వడ్డీ చెల్లించాలని ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌ను ఆయన సందర్శించారు. కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతు వర్క్‌షాప్ డీవైజీ ఎంకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు గృహ రుణాల వడ్డీ చెల్లించాలన్నారు. శ్రీరాంపూర్ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న 230 మంది మహిళా ఉద్యోగులకు వర్క్‌షాప్‌లోనే మోటార్ వైండింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీ యూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేణ శ్యాంకుమార్ కేంద్ర కార్యదర్శి కొత్తపల్లి బ్రహ్మాచారి, ఏరియా కార్యదర్శి గణపతి, వెంకటేశ్వర్లు, మహేశ్, తోకల వెంకటస్వామి, నీలం సదయ్య, పిట్ కార్యదర్శి రమేశ్, సహాయ కార్యదర్శి మహేశ్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.